క్లుప్తంగా

దుస్తుల పంపిణీ


ఎమ్మెల్యే బేబీ నాయన చేతులమీదుగా చీర అందుకుంటున్న మహిళ

బాడంగి: మండలంలోని పిన్నవలస గ్రామంలో ఎన్ఆర్ఐ కొల్లి రామినాయుడు దుస్తుల పంపిణీ శనివారం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బేబీ నాయన చేతులమీదుగా నిరుపేద మహిళలకు చీరలు, పురుషులకు పంచెలు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు సేవ చేస్తే భగవంతుడికి సేవ చేసినట్లేనని, ప్రతిఒక్కరూ మానవసేవే మాధవసేవగా భావించి, ప్రజాసేవకు ముందుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం ఇంతమంచి కార్యక్రమం తలపెట్టిన రామినాయుడును ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు, టీడీపీ నాయకుడు తెంటు రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత పాలిథిన్ సంచులు విక్రయిస్తే చర్యలు


బొబ్బిలి జంక్షన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్

రాజాం: నిషేధిత పాలిథిన్ సంచులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాజాం మున్సిపాలిటీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ హెచ్చరించారు. స్థానిక పట్టణంలోని బొబ్బిలి జంక్షన్ వద్ద ఉన్న పలు దుకాణాల్లో శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన ఆయన.. విక్రయానికి సిద్ధం చేసిన పలు పాలిథిన్ సంచులను స్వాధీనం చేసుకుని, సంబంధిత వ్యాపారులపై కేసులు నమోదు చేశారు. ఎప్పటికప్పుడు తనిఖీలు చేపడుతున్నా అధికారుల ఆదేశాలు బేఖాతరు చేస్తుండడం సరికాదన్నారు.

నేటి నుంచి యథావిధిగా తాగునీరు సరఫరా


పైపులైన్ మరమ్మతులు చేస్తున్న దృశ్యం

రాజాం సిటీ: పట్టణంలోని అన్ని వార్డులకు ఆదివారం నుంచి యథావిధిగా తాగునీరు సరఫరా చేయనున్నామని మున్సిపల్ ఏఈ వెంకట్ తెలిపారు. స్థానిక బొబ్బిలి రోడ్డులోని తాగునీటి సరఫరా ప్రధాన పైపులైన్ మరమ్మతులు శనివారం పూర్తి చేశారు. పట్టణంలో గత పది రోజులుగా నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పైపులైన్ మరమ్మతులను యుద్ధప్రాతిపదికన చేపట్టి, తాగునీటి సరఫరాను పునరుద్ధరించామని ఏఈ తెలిపారు.

వైభవంగా రామలింగేశ్వర స్వామి కల్యాణం


స్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

బొబ్బిలి: పట్టణంలోని కంచరవీధిలో ఉన్న శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామి కల్యాణం అంగరంగ వైభవంగా శనివారం నిర్వహించారు. వేకువజామున 5 గంటలకు ఆలయం తెరిచి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తుల సమక్షంలో స్వామి కల్యాణం చేశారు. పట్టణవాసులతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల భక్తులు ఈ కార్యక్రమానికి హాజరై, స్వామి కల్యాణం తిలకించారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

చీపురుపల్లిరూరల్(గరివిడి): పుస్తకపఠనంతో విజ్ఞానం పెరుగుతుందని, జ్ఞాన సముపార్జనకు పుస్తకాలు ఎంతో దోహదపడతాయని చీపురుపల్లికి చెందిన ఆశయ సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ అన్నారు.గరివిడి మండలంలోని బాగువలస గ్రామంలో ఆశయ రూరల్ లైబ్రరీ సేవలను విద్యార్థులకు శనివారం అందించారు. పుస్తకపఠనం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించి, వారితో పుస్తకపఠనం చేయించారు.విద్యార్థులు మొబైల్ ఫోన్లతో కాలక్షేపం చేయకుండా పుస్తక పఠనం చేయాలని, తల్లిదండ్రులు కూడా దీన్ని బాధ్యతగా తీసుకోవాలన్నారు.

ఈవీఎంల ట్యాంపరింగ్‌పై ఈసీ దృష్టి సారించాలి

- మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి, ఈవీఎంలు ట్యాంపరింగ్ చేశారనే ఆరోపణలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయని, వీటిపై ఈసీ(ఎలక్షన్ కమిషన్) ప్రత్యేక దృష్టిసారించి, చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు విజ్ఞప్తి చేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడిన ఆయన.. ఒకప్పుడు ఈవీఎంల పనితీరుపై టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు కూడా అనుమానాలు వ్యక్తం చేసిన విషయాన్ని వీడియో క్లిప్పింగ్ వేసి మరీ చూపించి, గుర్తుచేశారు. చాలా దేశాల్లో జరిగే ఎన్నికల్లో అసలు ఈవీఎంలే వినియోగించరని, వాటి పనితీరు సరిగా ఉండదన్న ఉద్దేశ్యంతోనే బహుశా వాటిని ఉపయోగించరేమోనన్నారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై ప్రజలందరికీ అనుమానాలు ఉన్నాయని, వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు. చాలాచోట్ల తమ పార్టీ అభ్యర్థులకే ఎక్కువ మంది ప్రజలు ఓట్లు వేశారని చెబుతున్నారని, అయినా తమకు కొన్ని సీట్లే రావడంపై సందేహాలు వస్తున్నాయన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల అభ్యర్థులకు అత్యధిక మెజార్టీ రావడం వెనక ఆంతర్యం తెలుసుకోవాలన్న ఉత్సుకత అందరిలో ఉందన్నారు. ఎన్నికల సంఘం విడుదల చేసిన ఓట్ల సంఖ్య కన్నా ఎన్నికల తర్వాత పోలైన ఓట్లు సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు సోషల్ మీడియాలో కూడా పోస్టులు చక్కర్లు కొడుతున్నాయన్నారు. అలాగే అరకు ఎంపీ ఎన్నిక ఫలితం కూడా చర్చనీయాంశమైందన్న విషయం తెలుసుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈవీఎంల ట్యాంపరింగ్‌పై నెలకొన్న అనుమానాలను తీర్చి, ప్రజాస్వామ్యాన్ని బతికించాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, తెర్లాం మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు, బొబ్బిలి మండల జేసీఎస్ ఇన్‌చార్జ్ తమ్మిరెడ్డి దామోదరరావు, న్యాయవాది మజ్జి జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

జీవామృతం తయారీపై అవగాహన


జీవామృతం తయారీని ప్రయోగాత్మకంగా వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రేగిడి: మండలంలోని చాటాయవలస గ్రామంలో జీవామృతం తయారీపై శనివారం అవగాహన కల్పించారు.

ప్రకృతి వ్యవసాయం ఐసీఆర్‌పీ పైల తవిటినాయుడు ప్రయోగాత్మకంగా జీవామృతం తయారీని రైతులకు వివరించి, వాటి ప్రయోజనాలు వివరించారు. ఎకరం పంటకు సంబంధించి, జీవామృతం తయారీకి 5 కిలోల ఆవుపేడ, 5 లీటర్ల ఆవు మూత్రం, 200 గ్రాముల ఇంగువ ద్రావణం మిశ్రమాన్ని నీటిలో కలిపి, దానిని నాలుగు రోజుల పాటు నిల్వ చేయాలి. ఉదయం, సాయంత్రం ఆ మిశ్రమాన్ని సవ్యదిశలో బాగా కలపాలి. ఈ మిశ్రమానికి 150 గ్రాముల సున్నం కలపాలి. అలాగే రెండు లీటర్ల మరగబెట్టిన నీటిలో 200 గ్రాముల ఇంగువ వేసి, అది చల్లారిన తర్వాత పేడమూత్రం ద్రావణంలో కలపాలి. ఈ ద్రావణాన్ని వడకట్టిన తర్వాత 200 లీటర్ల నీటిని కలిపి, ఎకరం విస్తీర్ణంలోని పంటపై పిచికారీ చేయాలన్నారు. ఇలా చేయడం ద్వారా పంటకు చీడపీడలు పట్టవన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంబిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు, ఆదాయం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు గుండాల రవి, పొదిలాపు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించండి


అడ్మిషన్ పత్రం అందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు లలితకుమారి, తదితరులు

రామభద్రపురం: ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని ప్రభుత్వ ఉపాధ్యాయులు కోరుతున్నారు. శనివారం స్థానిక చొక్కాపు వీధి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లలితకుమారి, సిబ్బందితో కలిసి పాఠశాల పరిధిలోని ఇంటింటికీ వెళ్లి, బడిఈడు పిల్లలందరినీ ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందించడంతో పాటు విద్యార్థికి ఉన్నత విలువలు, క్రమశిక్షణ, సంస్కృతీ సంప్రదాయాలు నేర్పిస్తున్నామన్నారు. అడ్మిషన్లు జరుగుతున్నాయని, తక్షణమే బడిలో చేరే పిల్లవాని వివరాలతో పాఠశాలను సంప్రదించాలన్నారు.

‘పచ్చిరొట్ట’తో పంటలకు మేలు

బాడంగి: పచ్చిరొట్ట ఎరువులతో పంటలకు మేలు జరుగుతుందని ఏవో కె.శిరీష తెలిపారు. ఇదే విషయమై ఆమె శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్ సాగుకు సంబంధించి, మండలానికి మొత్తం 164.5 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను తెప్పించి, రైతులకు అందించామన్నారు. 94.5 క్వింటాళ్ల కట్టిజనుము, 25 క్వింటాళ్ల పిల్లిపెసర, 45 క్వింటాళ్ల జీలుగు విత్తనాలు పంపిణీ చేశామన్నారు. వరినాట్లు వేసేముందు వీటిని పొలాల్లో వేసుకుని, మొక్కలైన తర్వాత వారం రోజుల పాటు నీరు పెట్టి ఊరబెడితే భూసారం పెరుగుతుందన్నారు. అప్పుడు పంటలకు అవసరమైన పోషకాలు నేల నుంచి అంది, అధిక దిగుబడులు వస్తాయన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బొబ్బిలి: పట్టణ పరిధిలోని పూల్‌భాగ్, అగ్రహారం ప్రాంతాలకు ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ ఆవాల అనంతరావు ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ సౌకర్యం ఉంటుందని, వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

గోవిందనాయుడుకు నివాళి


నివాళులర్పిస్తున్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం ప్రతినిధులు

బొబ్బిలి: గాయత్రి విద్యాసంస్థల కరస్పాండెంట్ పోల గోవిందనాయుడు ఇటీవల మృతి చెందారు. ఈ మేరకు స్థానిక పట్టణంలో శనివారం నిర్వహించిన సంస్మరణ సభలో ప్రైవేటు పాఠశాలల సంఘాల నాయకులు గోవిందనాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం విద్యాభివృద్ధికి, పిల్లల అభ్యసన ప్రగతికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కూర్మినాయుడు, శ్రీనివాసరావు, గౌరీశంకర్, నాగచంద్ర, నాగభూషణ్, కాంతిలాల్, శారద తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



వేపాడ: మండలంలోని బానాది గ్రామంలో కార్యసిద్ధి గణపతి ఆలయం వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు మేడపాటి కిశోర్ శర్మ, విష్ణుశర్మ స్వామివారికి స్నపన తిరుమంజనం, పంచామృతాభిషేకం చేసి పట్టువస్త్రాలంకరణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, భక్తులతో ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయం వద్ద మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


రేగిడి: దేవుదల అంగన్‌వాడీ కేంద్రంలో ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది


రాజాం: గర్భిణులకు ఆరోగ్య సలహాలు ఇస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

రాజాం: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని, మెరుగైన ఆరోగ్యానికి ప్రతిరోజూ తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని పెనుబాక హెల్త్ సెంటర్ ఎంఎల్‌హెచ్‌పీ వై.దేవమణి, ఏఎన్ఎం జి.యోగీశ్వరిలు సూచించారు. మండలంలోని పెనుబాక గ్రామం హెల్త్ సెంటర్ వద్ద గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు శనివారం నిర్వహించారు. అనంతరం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఆరోగ్య సలహాలు, సూచనలు ఇచ్చారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు పాటించాల్సిన ఆహారపు అలవాట్లను తెలిపారు. మనం ఆరోగ్యంగా ఉంటేనే మనకు పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్న విషయం మర్చిపోవద్దన్నారు.

రేగిడి: మండలంలోని బూరాడ, ఉనుకూరు, రేగిడి సెక్టార్‌ల పరిధుల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ప్రతిరోజూ మనం తీసుకునే ఆహారంలో పౌష్టికాహారం తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలన్నారు. మంచి ఆహారపు అలవాట్లు అలవర్చుకోవాలని తెలిపారు.

జోరుగా ‘ఉపాధి’ పనులు


రేగిడిలో ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులు

రేగిడి: మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులు జోరుగా జరుగుతున్నాయి. వేసవి ఎండల నేపథ్యంలో అధికారుల సూచనల మేరకు ఉదయం, సాయంత్రం ఎండ తీవ్రత తక్కువగా ఉన్న సమయంలో పనులకు వెళ్తున్నారు. నిర్దేశిత కొలతల ప్రకారం పనిచేస్తే రోజుకు రూ.300 గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుండడంతో జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరూ పనులకు వెళ్లేందుకు ఆసక్తి చూపిస్తుండడం విశేషం. మండలంలోని 39 గ్రామ పంచాయతీల పరిధిలో జరుగుతున్న పనుల్లో మొత్తం 10,500 మంది పనిచేస్తున్నారని ఏపీవో ఎస్.హరనాథ్ తెలిపారు.


తెర్లాంలో ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులు

తెర్లాం: ఉపాధి హామీ పథకం పనుల వేతనదారులంతా నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే రోజువారీ వేతనం గిట్టుబాటు అవుతుందని ఎంపీడీవో మధుసూదనరావు, ఏపీవో సుశీల తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనుల వారు శనివారం పరిశీలించి, వేతనదారులకు పలు సూచనలు చేశారు. వేసవి ఎండలు ఎక్కువగా ఉన్నందున వేతనదారులు ఇంటి నుంచి పనికి వచ్చేటప్పుడు తాగునీరు వెంట తెచ్చుకోవాలన్నారు. క్షేత్ర సహాయకులు పని ప్రదేశంలో టెంట్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

భగవద్గీత మోక్ష ప్రదాయిని


భగవద్గీత శ్లోకాలను వివరిస్తున్న ఆధ్యాత్మిక వక్త రమణ

రేగిడి: భగవద్గీత మోక్ష ప్రదాయిని అని, ప్రతిఒక్కరూ భగవద్గీత చదవాలని పాలకొండ ప్రాంతానికి చెందిన ఆధ్యాత్మిక వక్త ఎస్.వి.రమణ సూచించారు. మండలంలోని దేవుదళ గ్రామంలో ఉన్న గీతా మందిరంలో గొర్లె దామోదరరావు ఆధ్వర్యంలో దివ్య జీవన సత్సంగ సమావేశం శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భగవద్గీత పఠిస్తే చెడుగీతలు చెరిగిపోతాయని, మానసిక ప్రశాంతత కోసం ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. అనంతరం భగవద్గీతలోని ముఖ్యాంశాలను వివరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నిత్య స్మరణానందస్వామి, ఎం.సూర్యనారాయణ, మోహన్‌దాస్, అప్పలరాం తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో దీర్ఘకాలిక వ్యాధులు నయం


ఆరోగ్య తనిఖీలు నిర్వహిస్తున్న ఆయుర్వేద వైద్యాధికారి సునీల్‌కుమార్

రేగిడి: ఆయుర్వేదంతో దీర్ఘకాలిక వ్యాధులు నయమవుతున్నాయని, ప్రతిఒక్కరూ ఆయుర్వేద వైద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఖండ్యాం ప్రభుత్వ ఆయుర్వేద కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సునీల్‌కుమార్ కోరారు. మండలంలోని కొమెర గ్రామంలో ఆయుర్వేద వైద్యశిబిరం శనివారం నిర్వహించారు. వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ శిబిరానికి హాజరైన 52 మందికి ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కీళ్లనొప్పులతో బాధపడుతున్న ఎంతోమంది వృద్ధులకు ఆయుర్వేద మందులు ఉపయోగపడుతున్నాయని, అందరూ ఆయుర్వేదాన్ని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పాడి లక్ష్మునాయుడు, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, యోగా ఇన్‌స్ట్రక్టర్ రామకృష్ణ, ఏఎన్ఎం విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వృక్ష సంపదే లక్ష్యం


ఆటోలో తరలించేందుకు సిద్ధం చేసిన మొక్కలు

రాజాం సిటీ: రోజురోజుకు పెరిగిపోతున్న కాలుష్యాన్ని అధిగమించేందుకు వృక్ష సంపదే లక్ష్యంగా పర్యావరణ పరిరక్షణ సమితి అడుగులు వేస్తోంది. అనుకున్నదే తడవుగా ఈ నెల 5వ తేదీ నుంచే రాజాం పట్టణంలో వెయ్యి మొక్కలు నాటుదాం-వెయ్యి వృక్షాలు చేద్దాం పేరిట మొక్కల పెంపకానికి చర్యలు ప్రారంభించింది. ఇందులో భాగంగా మొక్కలు నాటే ప్రాంతాల వాసులతో సమితి సభ్యులు సమావేశమై, మొక్కల పెంపకం ఆవశ్యకత, వాటి ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. దీంతో వారంతా మొక్కలు నాటేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. స్థానిక పట్టణ పరిధిలోని అమ్మవారి కాలనీ, పొనుగుటివలస, మల్లిఖార్జునకాలనీ, సారధి తదితర ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమం శనివారం చేపట్టారు. పట్టణ పరిధిలోని ప్రాంతాల్లో మొక్కలు నాటేందుకు ఆసక్తి ఉన్న వారు తమను సంప్రదిస్తే మొక్కలు అందిస్తామని సమితి కన్వీనర్ ఆర్‌వీజే నాయుడు తెలిపారు. కదంబ, నేరేడు, వేప, కాగు, రోజా, ర్యాలీ, బాదం తదితర మొక్కలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

- గెలుపోటములు సర్వసాధారణం
- వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కడుబండి


కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కొత్తవలస: రాజకీయాల్లో ఏ పార్టీకీ అధికారం శాశ్వతం కాదని, గెలుపోటములు సర్వసాధారణమని, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు అధైర్య పడొద్దని, ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని అర్థన్నపాలెం గ్రామ సమీపంలోని తన క్యాంపు ఆఫీస్‌లో వేపాడ మండల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో శనివారం ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చిన తనతో పాటు మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీని వాసరావు తోడు గా ఉంటామని, ఏ అవసరం వచ్చినా తమను కలవచ్చని చెప్పారు. పార్టీ కోసం పని చేసిన ప్రతీ కార్యకర్తకు కృతజ్ఞతలు చెప్పారు. పార్టీలకతీతంగా ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు అందించామని, అయితే వైఎస్సార్‌సీపీ కంటే ఇంకా ఎక్కువ సంక్షేమ పథకాలు ఇస్తామని కూటమి హామీ ఇచ్చిన హామీలను ప్రజలు నమ్మారని చెప్పారు. చంద్రబాబునాయుడు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలతో పాటు ఇతర హామీలను కూడా అమలు చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీకి గ్రామస్థాయిలో మంచి ఓటు బ్యాంకు ఉందని, సుమారు 40శాతం ఓట్లు రావడమే అందుకు నిదర్శనమన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మళ్లీ పుంజుకొని ముందుకు పోదామని పిలుపునిచ్చారు. డీసీబీసీ చైర్మన్ వేచలపు చినరామునాయుడు, ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జగ్గుబాబు, నాయకులు దళ్ల మహేష్, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురంలో శనివారం సాయంత్రం పెదమానాపురం ఎస్ఐ శిరీష, పోలీసులు వాహన తనిఖీలు చేశారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహన పత్రాలతో పాటు వాహన చోదకులకు తప్పనిసరిగా లైసెన్స్ ఉండాలని అన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే సంబంధిత వాహన యజమానిపై చర్యలు తీసుకుంటామని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
బొబ్బిలి / రాజాం
9951602891, 9010133309
Office mail : vzmadvt@gmail.com